క్లుప్తంగా

జగనన్న లే అవుట్ పరిశీలన

పెడన: పట్టణంలోని జగనన్న పైడమ్మ లే అవుట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి శనివారం పరిశీలించారు. అక్టోబర్ 5న శంకుస్థాపన జరిగే ఆర్చి స్థలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కౌన్సిలర్లు కటకం ప్రసాద్, రాహేతున్నీసా, మెట్ల గోపీ ప్రసాద్, కొసనం కరుణ కుమారి, సతీష్‌బాబు పాల్గొన్నారు.

కె. కొత్తపాలెంలో వైద్య శిబిరం

కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెంలో సీజనల్ వ్యాధులు ప్రబలడంతో వైద్యశిబిరం ఏర్పాటు చేశామని మోపిదేవి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్ శనివారం తెలిపారు. రెండు రోజుల పాటు శిబిరం ఏర్పాటు చేయగా 15 మందికి వైరల్ ఫీవర్ సోకినట్లు, మరో 40 మందికి బీపీ, షుగర్ వంటివి గుర్తించి ఉచితంగా మందులు అందించామని తెలిపారు.

ముగిసిన గణపతి ఉత్సవాలు

బంటుమిల్లి: మండలంలో గణపతి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక రజక వీధిలోని గంగానమ్మ గుడి వద్ద నిలిపిన గణపయ్యకు ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు.

పర్యావరణ రక్షణకు కృషి

కోనేరుసెంటర్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బందరు మండలం మంగినపూడి బీచ్‌లో శనివారంస్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది బీచ్ ప్రాంగణంలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. డెప్యూటీ మేయర్‌లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం
- రోగులకు వైద్య పరీక్షలు.. మందుల పంపిణీ



మర్రిపాలెంలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, ఎంపీపీ భోగాది తదితరులు



బందరు రైలుపేటలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో కమిషనర్ చంద్రయ్య, డీఎంహెచ్‌ఓ గీతాబాయి

కొక్కిలిగడ్డ(మోపిదేవి): ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలన్నదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధి కొక్కిలిగడ్డ ఎంపీపీ పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలుతో నూతన ఒరవడికి నాంది పలికారని చెప్పారు. ముఖ్యమంత్రి జగనన్న వైద్య ఆరోగ్య సేవల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి సేవలు అందిస్తున్నారని వివరించారు. రాష్ట్రీయ బాల రాష్ట్ర స్వస్త జిల్లా నోడల్ అధికారి (ఆర్‌బీఎస్‌కే), కుంభా రత్నగిరి, డాక్టర్స్ హారిక, అనిల్‌కుమార్, ఎల్. లక్ష్మీనాథ్, మెడికల్ కళాశాల వైద్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మచిలీపట్నంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి. రాజాబాబు కోరారు. రైలుపేట నగర పాలక సంస్థ ప్రత్యేక ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మతో కలిసి కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైలుపేటలో శిబిరానికి 2 వేల మందికి పైగా రోగులు హాజరుకాగా వైద్య పరీక్షలు నిర్వహించి మందుల కిట్లను ఉచితంగా అందజేశామని తెలిపారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) వైద్య శిబిరాన్ని సందర్శించారు. డెప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మునిసిపల్ కమిషనర్ జి. చంద్రయ్య, డీఎంహెచ్‌ఓ జి. గీతాబాయి, కార్పొరేటర్ రామిశెట్టి వాణిశ్రీ, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సేవలు వరం..

మర్రిపాలెం(నాగాయలంక): మర్రిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రారంభించారు. 370 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉచితంగా మందులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు ప్రజలకు వరమని చెప్పారు. ఇలాంటి అనేక సంక్షేమ, సేవా, అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం అమలు చేస్తుంటే తమకు రానున్న ఎన్నికల్లో పుట్టగతులు ఉండవనే భయంతో జగనన్నపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని చెప్పారు. మండల పరిషత్ అధ్యక్షురాలు భోగాది రాఘవ రాణి, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, భోగాది శేషగిరి రావు, ముమ్మారెడ్డి చంటి, తోట సాయిబాబు, తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ముంజులూరులో 478 మందికి వైద్య పరీక్షలు

బంటుమిల్లి: మండల పరిధి ముంజులూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 478 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బంటుమిల్లి పీహెచ్‌సీ వైద్యులు కె. పవన్‌కుమార్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎంపీపీ వి. చినబాబుతో కలిసి మంత్రి జోగి రమేష్ తనయుడు రాజీవ్ ప్రారంభించారు. జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

చల్లపల్లి: ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారం తీసుకుంటే అద్భుతమైన పోషకాలు లభిస్తాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక గ్రామ సచివాలయం–1 ఆవరణలో జగనన్న సంపూర్ణ ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార స్టాల్ ఏర్పాటు చేసి చిరుధాన్యాలతో లభించే పోషకాలపై అవగాహన కలిగించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: రాష్ట్రంలోని ప్రతి పేదవాడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. దక్షిణ చిరువోలు లంకలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శిబిరానికి హాజరైన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కోడూరు: రామకృష్ణాపురం సచివాలయం పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 362 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి సత్యనారాయణ, జిల్లా అటవీ శాఖాధికారి రాజశేఖర్, తహసీల్దార్ లతీఫ్‌బాషా, ఎంపీడీఓ ఆర్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

260 మందికి వైద్య పరీక్షలు

కృత్తివెన్ను: మండలంలోని పల్లెపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. సీనియర్ సర్జన్ సురేష్, కృత్తివెన్ను, లక్ష్మీపురం, చినపాండ్రక పీహెచ్‌సీల వైద్యులు సందీప్, మిధున, అల్తాఫ్, హీరాలు పాల్గొని 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పి. మహేష్, సర్పంచ్ పల్నాటి రాజు, నాయకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మంత్రి జోగి రమేష్



పెడన: నిరుపేదల అభ్యున్నతికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. శనివారం పెడన మండలం ఉరివి గ్రామం, పెడన, బంటుమిల్లి మండలాల ఉమ్మడి గ్రామం నరసప్ప చెరువులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రావడం వలన మీకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయని చెప్పారు. ఇవి ఇలాగే కొనసాగాలంటే మళ్లీ మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉండాలని, అందుకు మీరంతా ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ వాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ చారుమతి, ఎంపీటీసీ విజయలక్ష్మి, భైరవలింగం, రామానాయుడు, అచ్యుతరావు, నాగబాబు, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ వి. రెడ్డయ్య, బంటుమిల్లి ఎంపీపీ చినబాబు, అధికారులు పాల్గొన్నారు.

గూడూరు ఎస్‌ఐ శేషుకుమార్ బాధ్యతల స్వీకారం

గూడూరు: గూడూరు ఎస్‌ఐగా వి.శేషుకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడికి చెందిన శేషుకుమార్ 2012 బ్యాచ్ ఎస్‌ఐగా పోలీసు శాఖలో చేరారు. అనంతరం తూర్పు గోదావరి జిల్లాలో మొదటి పోస్టింగ్ తీసుకున్న ఆయన ప్రస్తుతం వీఆర్ నుంచి గూడూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన వి.వెంకటేష్ బదిలీపై మచిలీపట్నం స్పెషల్ బ్రాంచ్‌కు వెళ్లారు.

ప్రాధాన్యతా క్రమంలో వార్డుల అభివృద్ధి

మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: ప్రాధాన్యతా క్రమంలో నిధుల లభ్యతను బట్టి అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని, వార్డులను పట్టించుకోకపోవడం అంటూ ఏమి ఉండదని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. శనివారం ఉదయం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు మాట్లాడుతూ పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని, పట్టణంలో విషజ్వరాల ప్రభావం అధికంగా ఉందన్నారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే పారిశుద్ధ్యం మెరుగుపరచాలని చైర్‌పర్సన్‌ను కోరారు. కమిషనర్ మహేంద్ర మాట్లాడుతూ ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేయించామని, వార్డులలో పిచికారీ చేయిస్తున్నామని వివరించారు. స్ప్రేయింగ్ పనిముట్లు కూడా రిపేర్లు చేయించాల్సి ఉందని తెలిపారు. పారిశుద్ధ్య పనులు మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ ఆదేశించారు. అనంతరం అజెండాలోని 16 అంశాలపై చర్చించి ఆమోదించారు. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయం చాలా తక్కువగా ఉందని, చైర్‌పర్సన్‌గా నాగకుమారి బాధ్యతలు చేపట్టేనాటికి జీరో బ్యాలెన్సు ఉందని, రావాల్సిన ఆదాయం పెండింగ్ పడుతోందని, ఖర్చులు మాత్రం ఆగడం లేదని అన్నారు. పారిశుద్ధ్యం మెరుగు పరుస్తామని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, సీనియర్ కౌన్సిలర్లు పిచ్చిక సతీష్‌బాబు, మెట్ల గోపి, అధికారులు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి ఆటోడ్రైవర్ల క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు, చిత్రంలో ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా ఐదేళ్లలో అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.6.86 కోట్లను ఆటోడ్రైవర్ల ఖాతాకు ప్రభుత్వం జమ చేసిందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. అవనిగడ్డలో శనివారం వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని ఎమ్మెల్యే సింహాద్రి ప్రారంభించి మాట్లాడారు. ఈ ఏడాది అవనిగడ్డ నియోజకవర్గంలో 1399 మంది ఆటో డ్రైవర్లకు రూ.1,39,90,000 జమ చేశామని వివరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ఆటో డ్రైవర్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వంతెన సెంటర్‌లోని దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకూ ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆటో డ్రైవర్లు క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సింహాద్రి వెంకటేశ్వరరావు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కమనీయం ప్రసన్న గణపతి కల్యాణం

నాగాయలంక: గ్రామంలోని ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు శనివారం 13వ రోజుకు చేరుకున్నాయి. ఉత్సవ వేదికపై ప్రసన్న గణపతి శాంతి కల్యాణం కనుల పండువగా జరిగింది. సిద్ధి,బుద్ధి సమేత ప్రసన్న గణపతి స్వామి ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. చిట్టా హరేకృష్ణ–వాణి, చిట్టా మల్లికార్జున్–బేబి, పిచ్చుక పాపారావు–అరుణకుమారి, గోలి సుధాకర్–హేమరాణి, మండవ శ్రీనివాసరావు–లక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని పూజా క్రతువు జరిపారు. కమిటీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. డాక్టర్ కొత్తపల్లి నాగేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఎం.బాలసుందరం భాగవతార్ (తాడేపల్లిగూడెం) విరాటపర్వం హరికథా గానం చేశారు. విద్వాన్ బ్రహ్మశ్రీ పాలపర్తి ఆంజనేయులు వయొలిన్, విద్వాన్ నగధరరావు (తెనాలి) మృదంగంతో సహకారం అందించారు. తొలుత ప్రసన్న గణపతి స్వామివారి సన్నిధిలో, ఉత్సవ వేదికపై నిత్య వినాయక పూజా కార్యక్రమాలు జరిగాయి.

మల్లయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

మచిలీపట్నంటౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యకారుల సహకార సంఘాల బలోపేతానికి కృషి చేసిన ఏఎల్ మల్లయ్యను మత్స్యకారులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార సంఘాల సమాఖ్య తొలి చైర్మన్ ఏఎల్ మల్లయ్య సంస్మరణ కార్యక్రమం శనివారం జిల్లా మత్స్యకారుల సహకార సంఘ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమ సంఘాల నాయకుడు కేవీవీ ప్రసాదరావు మాట్లాడుతూ మల్లయ్య సేవలను కొనియాడారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేత

మచిలీపట్నంటౌన్: పట్టాభి గ్రామీణాభివృద్ధి సంస్థలో టైలరింగ్, కంప్యూటర్ ట్యాలీ, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోర్సుల్లో శిక్షణ పూర్తిచేసుకున్న 92 మందికి ధ్రువీకరణ పత్రాలను శనివారం యూనియన్ బ్యాంక్ మచిలీపట్నం రీజియన్ అధికారి వెంకట్రావు అందజేశారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జయవర్ధన్, డీఈఓ తాహెరా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

నాగశిలల సరఫరాకు టెండర్ ఖరారు

మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో రాతి నాగశిలల సరఫరాకు సీల్డ్ టెండర్ కం వేలం ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించామని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నాగశిలల సరఫరాతోపాటు అన్నప్రసాదం హాల్‌లో అల్యూమినియమ్ ఫ్రేమ్ వర్క్‌తో పార్టీషన్ పనులను గుడివాడకు చెందిన బోసపాడు హరిప్రసాద్ దక్కించుకున్నారని చెప్పారు. భక్తులు సమర్పించిన తలనీలాలు పోగుచేసుకునే హక్కునకు ఎవరూ సీల్డ్ టెండర్స్ వేయనందున వాయిదా వేశామన్నారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

చిలకలపూడిలో 'నా భూమి..నా దేశం'

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి పాండురంగ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో శనివారం నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ తాహెరా సుల్తానా, డీవైఈఓ యూవీ సుబ్బారావు, జిల్లా సైన్స్ అధికారి జాకీర్ అహ్మద్, ఎంఈఓ దుర్గాప్రసాద్ పాల్గొని మట్టికుండలో మట్టిని వేశారు. విద్యార్థులు ప్రదర్శించిన మట్టి నమూనాలను సందర్శించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఆర్థిక సాయం అందజేత

మచిలీపట్నంటౌన్: 38వ డివిజన్‌కు చెందిన పింఛనుదారు ఇ. రామలక్ష్మి ఇటీవల మృతిచెందారు. తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 20 వేలను రామలక్ష్మి కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాకోళపు నరసింహగుప్తా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: పదో డివిజన్‌లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20 లక్షలతో నిర్మించనున్న కల్వర్టులు, డ్రెయిన్ల పనులను మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ టెంకాయ కొట్టి ప్రారంభించారు. తొలుత మేక్ ఇండియా క్లీన్ కార్యక్రమంలో భాగంగా నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి కోనేరుసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మేయర్ వెంకటేశ్వరమ్మ జెండా ఊపి ప్రారంభించారు. డెప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, కార్పొరేటర్లు షేక్ ముంతాజ్‌బేగం, రామిశెట్టి వాణిశ్రీ, యండ్రపాటి నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేద్దాం

బంటుమిల్లి: గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాలని ఎంపీపీ వి. చినబాబు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ గ్రామానికి రూ. 40 లక్షలు కేటాయిస్తున్నారని, ఆ నిధులతో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈఈ మణికంఠ నివేదికను సమర్పించారు. ఎంపీటీసీ ఎండీ కమాల్‌బాషా మాట్లాడారు. తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, వైస్ ఎంపీపీలు ఓ. చిన్నారిబాబు, కె. లలిత, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, ఎంపీటీసీలు ఎం. లక్ష్మీశకుంతల, టి.లక్ష్మి, కె. కనకదుర్గ, వెంకటేశ్వరమ్మ, పి. భగవాన్, పలు గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో ఈవీఎంలను శనివారం కలెక్టర్ పి. రాజాబాబు పరిశీలించారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కంపెనీ నుంచి ఇటీవల జిల్లాకు 5,620 బ్యాలెట్ యూనిట్లు, 4,320 కంట్రోల్ యూనిట్లు, 5,300 వీవీ ప్యాట్‌లు ఈవీఎం గోడౌన్‌కు వచ్చాయి. బెల్ కంపెనీ ఇంజినీర్లు వచ్చిన ఈవీఎంలను సరిగ్గా పనిచేస్తున్నాయా, లేదా అని పరిశీలించారు. ఈ ప్రక్రియ సక్రమంగా జరుగుతుందో, లేదోనని కలెక్టర్ రాజాబాబు తనిఖీ చేసి సంబంధిత ఇంజినీర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. డీఆర్వో పి. వెంకటరమణ, డీపీఓ నాగేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డివిడెండ్లు పంపిణీ

గూడూరు:మల్లవోలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మహాజన సభ శనివారం నిర్వహించారు. సభకు మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ ముఖ్యఅతిథిగా హాజరై రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలలో రూ.18.24 లక్షల డివిడెండ్లను రైతులకు పంపిణీ చేశారు.